సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం । 18 । డిసెంబర్ । 2024

చలిమంట కాగుతున్న యువత, వృద్ధులు (ఇన్‌సెట్) శాలువా చుట్టుకున్న వృద్ధురాలు



- ఓ పక్క చలి వణికిస్తున్నా తప్పని తిప్పలు
- రాత్రివేళ సేవలందిస్తున్న వాచ్‌మెన్లు, హోటళ్ల నిర్వాహకులు, ఆటోడ్రైవర్లు
- బస్టాండ్లు, ఆస్పత్రుల్లో షెల్టర్లు లేక పలువురి అవస్థ
- యాచకులు, నిరాశ్రయుల పరిస్థితి మరీ దారుణం

చలి తీవ్రతపై 'సాక్షి' పరిశీలన

జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా చలి పెరిగింది. పగలు కూడా తక్కువ ఉష్ణోగ్రతలే నమోదవుతుండగా.. సాయంత్రం ఆరు దాటాక చలి తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది. ఇక రాత్రి వేళ బయటకు వచ్చే పరిస్థితి లేదు. అయినా పొట్టకూటి కోసం, అత్యవసర పనులపై బయటకు వచ్చే వారు అవస్థ పడుతున్నారు. వివిధ షాపుల వద్ద విధులు నిర్వర్తిస్తున్న వాచ్‌మెన్లు, అర్ధరాత్రి వరకు ఉండే హోటళ్లు, 24 గంటల మందుల షాపుల నిర్వాహకులు, ఆటోడ్రైవర్లు ఈ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. దూరప్రయాణాల కోసం బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వేచి ఉండే వారికి చలి ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యాన ఖమ్మం, కొత్తగూడెంలో సోమవారం అర్ధరాత్రి 12 నుంచి మంగళవారం తెల్లవారుజామున 3 గంటల వరకు 'సాక్షి' బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వెల్లడైన పరిస్థితులు, చలి కారణంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్న వారి వివరాలతో కథనం. – ఖమ్మం మయూరిసెంటర్/కొత్తగూడెం అర్బన్

గ్రౌండ్ రిపోర్ట్

చలిమంట కాగుతూ..

మూడు రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరగడంతో రాత్రి వేళ పనులు చేసేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని దుకాణాలు, మాల్స్ తదితర వాటి ముందు ఉండే సెక్యూరిటీ సిబ్బంది ఉపశమనం కోసం చలిమంటలు వేసుకుంటున్నారు. నలుగురైదుగురు ఒకేచోట చేరి చలిమంట కాగుతూనే మరోపక్క తమ విధులనూ నిర్వర్తిస్తున్నారు.

చలిలోనూ జీవనయానం

ముసుగులతోనే ప్రయాణం

రాత్రివేళ ప్రయాణించే వారు చలితో గజగజ వణుకుతున్నారు. ప్రధానంగా ఆర్టీసీ బస్సులు, రైళ్ల ద్వారా ప్రయాణించే వారు రాత్రి వేళ ఖమ్మం కొత్తబస్టాండ్, కొత్తగూడెం బస్టాండ్, రైల్వేస్టేషన్లకు చేరేందుకు శరీరమంతా మందపాటి దుస్తులు కప్పుకుని వస్తున్నారు. ఇక బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా కనిపించాయి. అటు ఖమ్మం, ఇటు కొత్తగూడెం బస్టాండ్లలో వేచి ఉండేందుకు ఎలాంటి గదులు లేకపోవడంతో తమ వద్ద ఉన్న దుస్తులను ఒంటిపై కప్పుకొని అక్కడే దుప్పట్లు వేసుకుని నేలపై ముడుచుకొని పడుకుంటున్నారు. ఆయా కుటుంబాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు చలి కారణంగా మరింత ఇబ్బంది పడుతున్నారు.



కొత్తగూడెం బస్టాండ్‌లో చలి తీవ్రత తట్టుకోలేక టీ తాగుతున్న ప్రయాణికులు

ప్రమాదమని తెలిసినా..

ఆరుగాలం శ్రమించి పండించిన కూరగాయలను విక్రయించేందుకు తెల్లవారుజామున కల్లా మార్కెట్‌కు తీసుకురావాలని రైతులు తపిస్తున్నారు. కాస్త ఆలస్యమైనా వేలం ముగిసి ధర దక్కదనే భావనతో అర్ధరాత్రి తర్వాత చలిలోనే బైక్‌లపై బస్తాల్లో కూరగాయలను మార్కెట్‌కు చేరుస్తున్నారు. ఇతర వాహనాలు ఉంటాయి కదా అని ఆరా తీస్తే రాత్రి కావడంతో ఎక్కువ కిరాయి అడుగుతారని.. అందుకే ఒకటి, రెండు బస్తాల కూరగాయలను ద్విచక్ర వాహనాలపైనే తెస్తున్నామని రైతులు తెలిపారు. వణికించే చలిలో వాహనం నడపడం ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో వస్తున్నామని చెప్పారు.



రాత్రి 2-30కు కూరగాయల మార్కెట్‌లో..

బతుకు పోరాటం..

చలికి సాధారణ ప్రజలెవరూ బయటకు వచ్చే పరిస్థితి లేకపోయినా ఉపాధి కోసం బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద తోపుడుబండ్లపై టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్న వారు ఎప్పటిలాగే బండ్లు ఏర్పాటుచేస్తున్నారు. అయితే, మిగతా సమయాలతో పోలిస్తే పెద్దగా గిరాకీ ఉండడం లేదని వారు వాపోయారు. ఖమ్మం, కొత్తగూడెం బస్టాండ్లు, కూరగాయల మార్కెట్ వద్ద ఇలాంటి బండ్లు ఉండగా రాత్రంతా ఇడ్లీ, దోశ వంటి టిఫిన్లు అందుబాటులో ఉంటున్నాయి. అర్ధరాత్రి తర్వాత 3గంటల వరకు చలిలోనూ ఈ బండ్లు కొనసాగుతుండగా.. ప్రయాణాలు, మార్కెట్‌లో లావాదేవీలకు వచ్చే వారు టిఫిన్ కోసం అడపాదడపా వస్తుండడం కనిపించింది.



అర్ధరాత్రి 2 గంటలకు ఖమ్మం బస్టాండ్ వద్ద..



కొత్తగూడెం బస్టాండ్‌లో వెయిటింగ్‌హాల్ లేక నేలపైనే నిద్ర..

హమాలీలు, ఆటో డ్రైవర్లు

మండే ఎండ, వణికించి చలిలోనూ హమాలీలు శ్రమించక తప్పడం లేదు. శీతాకాలం రాత్రి అత్యల్ప ఉష్ణోగ్రతల నడుమ కూడా వారు పనిచేస్తున్నారు. కూరగాయల మార్కెట్‌కు వచ్చిన బస్తాలను దింపడం, ఇతర వాహనాల్లో ఎక్కిస్తేనే తమకు నాలుగు రూపాయలు వస్తాయని తెలిపారు. విరామ సమయంలో కాసేపు చలిమంట కాగుతూనే మిగతా సమయంలో పనులు కొనసాగిస్తున్నారు. ఇక రాత్రి వేళ ఆటోలు ఎక్కే వారు తక్కువగానే ఉంటున్నా వచ్చే గిరాకీ పోనివ్వొద్దనే భావనతో డ్రైవర్లు చలికి ఇబ్బంది పడుతూనే ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నారు.



నిర్మానుష్యంగా మారిన రామవరం జాతీయ రహదారి



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో నిద్రిస్తున్న యాచకులు

రెండు రోజులుగా ఇబ్బందులు



గత రెండు రోజులుగా చలి పెరగడంతో వణుకు పుడుతోంది. చలి నుంచి రక్షణకు రెండు మూడు షాపుల్లో పనిచేసే వాచ్‌మెన్లం కలిసి చలిమంట కాగుతున్నాం. అటు షాప్‌లకు కాపలా కాస్తూనే ఇటు మమ్మల్ని మేం రక్షించుకోవాల్సి వస్తోంది. ఇంకెన్ని రోజులు ఇలా ఉంటుందో తెలియడం లేదు.

– నాగుల్‌మీరా, వాచ్‌మెన్

చేతులు గడ్డ కడుతున్నాయి..



ఒక్కసారిగా పెరిగిన చలితో ఆటో నడపలేకపోతున్నాం. ఆటో నడుపుతుంటే చేతులు గడ్డ కడుతున్నాయి. ప్రయాణికులను దింపగానే బస్టాండ్ వద్దకు వచ్చి చలిమంట కాగుతున్నాం. అయినా చలితో తట్టుకోలేకపోతున్నాం. రెండేసి చొక్కాలు వేసుకుని స్వెటర్లు ధరించినా మాకు తిప్పలు తప్పడంలేదు.

– బి.రాజు, ఆటో డ్రైవర్

వెయిటింగ్ హాల్ ఉంటే బాగుండు...



హైదరాబాద్ నుంచి ఇల్లెందు వెళ్తూ అర్ధరాత్రి 12–30 గంటలకు ఖమ్మంలో దిగాం. ఇప్పుడు ఇల్లెందుకు బస్సులు లేవు. దీంతో పిల్లాపాపలతో కలిసి బస్టాండ్‌లోనే ఉన్నాం. చలి నుంచి రక్షణ, ఇటు భద్రత కోసం వెయిటింగ్ హాళ్లు ఉంటే బాగుండేది. అవి లేకపోవడంతో వణుకుతూనే కూర్చున్నాం.

– ఎస్.కే.జానీ, ప్రయాణికుడు, ఇల్లెందు

పండిన పంట పాడవ్వకూడదని..



కష్టపడి పండించిన కూరగాయలు సమయానికి కోసి అమ్మకుంటే పాడవుతాయి. అందుకే చలి ఉన్నా అర్ధరాత్రి దాటాక ఖమ్మం కూరగాయల మార్కెట్‌కు తీసుకొస్తున్నాం. కిరాయి చెల్లించలేక బండ్లపైనే బస్తాలు కట్టుకొస్తున్నాం. రెండు రోజులుగా చలి పెరిగినా తప్పని పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

– ఆంగోతు రంగా, రైతు, సూర్యాతండా



అర్ధరాత్రి 2-30 గంటలకు పాల ప్యాకెట్లు దిగుమతి చేస్తున్న సిబ్బంది

న్యూస్‌రీల్

ప్రణాళికాయుతంగా చదవాలి

డీఐఈఓ వెంకటేశ్వర రావు

చర్ల: పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి హెచ్.వెంకటేశ్వర రావు సూచించారు. మంగళవారం ఆయన దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. బోధనా తీరును పరిశీలించి, విద్యార్థుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు సమీపిస్తున్నందున ఒత్తిడికి లోను కాకుండా ఉండాలని సైన్స్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కృష్ణవేణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

పాల్వంచ: ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సర్వే ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ బి.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని పునుకుల, కోడిపుంజుల వాగు, కిన్నెరసాని గ్రామాల్లో చేపట్టిన సర్వేను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాపాలనలో అందిన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి కలెక్టర్ సూచించిన ప్రకారంగా విత్తనాలు ఉండాలని, ఈత, తాటి మొక్కలను స్థానికంగా సేకరించి నాటాలని అన్నారు. ఆమె వెంట అధికారులు బొగ్గ నారాయణ, పొరండ్ల రంగా, కార్యదర్శులు బాబూరావు, శ్రీనివాస్, ఎఫ్ఏ సామ్రాజ్యం ఉన్నారు.

'గిరిజన పల్లె' పనులు ముక్కోటికి పూర్తి కావాలి

- అధికారులకు ఐటీడీఏ పీఓ సూచన
- దమ్మపేట మండలంలో పాఠశాలల తనిఖీ
- భారజల కర్మాగారం సందర్శన

భద్రాచలం/చర్ల/అశ్వాపురం : ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియం వద్ద నిర్మిస్తున్న 'గిరిజన పల్లె పనులు' ముక్కోటి ఏకాదశి నాటికి పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని పీఓ బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఆయన పనులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు దర్శనం అనంతరం నేరుగా ట్రైబల్ మ్యూజియం, గిరిజన పల్లెను సందర్శించేలా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. పాతతరం ఇళ్ల నిర్మాణం, గుడిసెలు, ఆదివాసీ సంస్కృతి వంటి టూరిస్టులకు కనువిందు కలిగే పనులు ముగింపు దశకు వచ్చాయని, పర్యాటకులను ఆకర్షించేలా డిజైనింగ్, మ్యూజియాన్ని సోలార్ లైట్లతో అలంకరించనున్నామని తెలిపారు. ఆ తర్వాత దుమ్ముగూడెం మండలంలోని బండారుగూడెం, రేగుంట ప్రాథమిక పాఠశాలలు, ఆర్లగూడెంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. బోధనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులు వెనుకబడ్డారని గతంలో గుర్తించి వారిని బలోపేతం చేసేందుకు ఉద్దీపకం పేరుతో వర్క్‌బుక్‌ను రూపొందించామని, వాటిని ఉపాధ్యాయులు సరైన రీతిలో ఆచరణలో పెట్టడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రేగుంట పాఠశాలలో వసంత అనే ఉపాధ్యాయురాలు అనధికారిక సెలవుపై వెళ్లిన విషయాన్ని గమనించిన పీఓ ఆమెతో పాటు టీచింగ్ డైరీ సక్రమంగా నిర్వహించని వెంకన్న, సత్తెమ్మ అనే ఉపాధ్యాయులకు కూడా షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఏసీఎంఓ రమణయ్యను ఆదేశించారు.



చర్ల : విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

భారజల కర్మాగారంలో..

మణుగూరు భారజల కర్మాగారాన్ని పీఓ రాహుల్ సందర్శించారు. అనంతరం జీఎం, అధికారులతో సమావేశమయ్యారు. భారజల ఉత్పత్తి ప్రక్రియను జీఎం జగ్గారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భారజలంతో పాటు కేన్సర్ నిర్ధారణకు ఉపయోగించే ఆక్సిజన్–18 ను ఉత్పత్తి చేస్తున్నామని చెప్పారు. భారజల కర్మాగారం ద్వారా విడుదలవుతున్న ఉత్పత్తులతో లాభాలు, యాష్‌కు సంబంధించిన అంశాలు గిరిజనులకు ఏమైనా ఉపయోగపడుతాయో చర్చించి తదుపరి విషయాలు తెలియజేస్తామని పీఓ అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, అశ్వాపురం తహసీల్దార్ స్వర్ణలత, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, ఏసీఎంఓ రమణయ్య, ఐటీసీ జీఎం చంగల్‌రావు, జేడీఎం హరికృష్ణ, భద్రాచలం గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరావు, ట్రైబల్ మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

కేంద్ర ఆర్థికశాఖ అదనపు సెక్రటరీ తంగిరాల

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వివిధ పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు రుణాలు అందిస్తూ సహకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ అదనపు సెక్రటరీ డాక్టర్ ఎంపీ తంగిరాల అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం నీతి ఆయోగ్ ఆకాంక్షిత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా నిర్వహించారు. మొదట కలెక్టర్ జితేష్ వి పాటిల్.. జిల్లాలో విద్య, వైద్యారోగ్య, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఔత్సాహికులకు కంపారిజన్ బయోగ్యాస్ ప్లాంట్, తేనెటీగల పెంపకం, డ్రాగన్‌ఫ్రూట్ సాగు, జీడి పంట వంటి పంటల విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అనంతరం తంగిరాల మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జనరల్ యోజన, ముద్ర రుణాలు మంజూరు చేయాలని అన్నారు. జిల్లాలో ముద్ర రుణాలు ఎందుకు తక్కువగా ఉన్నాయని బ్యాంకర్లను ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఎంపీ తంగిరాల, పక్కన కలెక్టర్ పాటిల్ తదితరులు

అందరికీ బీమా కల్పించడమే లక్ష్యం

చంద్రుగొండ : దేశంలో ప్రతీ పౌరుడికి బీమా పథకం ఉండాలన్నదే లక్ష్యమని, ఈ దిశగా పని చేస్తున్నామని డాక్టర్ ఎంపీ తంగిరాల అన్నారు. మండలంలోని అయన్నపాలెంలో మంగళవారం బీమా పథకంపై పొదుపు సంఘాల మహిళలకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. వయసుతో సంబంధం లేకుండా జీవనజ్యోతి బీమా యోజన పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. కుటుంబసభ్యులంతా బీమా చేయించుకోవాలన్నారు. బీమా తీసుకున్న వారిలో దామరచర్ల గ్రామం ప్రథమస్థానంలో నిలవడం అభినందనీయమని అన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి జనసురక్ష బీమా అందరికీ చేయాలని అన్నారు. ఆ తర్వాత అయన్నపాలెం గ్రామానికి చెందిన నేర్ళ్ల సుబ్బలక్ష్మికి రూ. 2 లక్షల చెక్కు అందించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీఓ సంజీవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, ఎస్‌బీఐ జీఎం ప్రకాష్‌చంద్ర బరోరా, డీజీఎం ప్రశాంత్‌కుమార్ బరియార్, డీజీఎం గస్‌కామ్ సోలంగ్, ఆర్ఎం మిద్దెల సత్యనారాయణ, కొత్తగూడెం ఎస్‌బీఐ మేనేజర్ ఎస్.రాజారావు, చంద్రుగొండ ఎస్‌బీఐ మేనేజర్ హతీరాం, తహసీల్దార్ సంధ్యారాణి పాల్గొన్నారు.

శ్రీరామ పునర్వసు దీక్షల విరమణ

బేడా మండపంలో రామయ్యకు పట్టాభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం భక్తులు చేపట్టిన శ్రీరామ పునర్వసు దీక్ష విరమణ కార్యక్రమం వైభవంగా జరిగింది. తొలుత రామపాదుకలతో ఊరేగింపుగా మంగళ వాయిద్యాల నడుమ గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం బేడా మండపంలో శ్రీరామ దీక్ష విరమణ పూజలు, సంక్షిప్త రామాయణ హవనం జరిపించారు. అదేవిధంగా తిరుప్పావై సందర్భంగా పాశుర పఠనం, సేవాకాలం, ప్రవచనం, తీర్థ గోష్టి కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు.

స్వామివారికి పట్టాభిషేకం..

పునర్వసు నక్షత్రం సందర్భంగా బేడా మండపంలో రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఘనంగా జరిపించారు. ఆ తర్వాత పట్టాభిషేక క్రతువును ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి ఉపాలయంలో ఆంజనేయస్వామికి అభిషేకం, తమలపాకులతో అర్చన గావించారు.



బేడా మండపంలో శ్రీరామ దీక్ష విరమణ పూజలు, పాల్గొన్న మాలధారులు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి విశాఖపట్టణానికి చెందిన ఏవీకే జగదీష్ – శాంతి దంపతులు రూ.లక్ష, అలాగే విశాఖకు చెందిన దమయంతి రూ. లక్ష చెక్కు ను ఆలయ అధికారులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపికను అందజేశారు. ఆలయ పీఆర్ఓ సాయిబాబా పాల్గొన్నారు.



దీక్ష విరమణ చేస్తున్న అర్చకుడు

వలస ఆదివాసీలకు అండగా ఉంటాం

ఎస్పీ రోహిత్‌రాజ్

గుండాల: వలస ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, అసాంఘిక శక్తులతో కలిసినట్లు తెలిస్తే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. గుండాల మండలం అడవిరామవరం గొత్తికోయ గ్రామంలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 35 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. ఆదివాసీలకు దుప్పట్లు, సోలార్ లైట్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వలస ఆదివాసీల అభివృద్ధికి ఇతర ప్రభుత్వ శాఖలతో కలిసి పని చేస్తామని చెప్పారు. పిల్లలను బాగా చదివించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. గ్రామాల్లోకి అజ్ఞాత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దన్నారు. అనంతరం గ్రామస్తులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) సాయిమనోహర్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, గుండాల, టేకులపల్లి సీఐలు రవీందర్, సురేష్, ఎస్ఐలు రాజమౌళి, రతీష్, శ్రీకాంత్, వైద్యులు సంఘమిత్ర, సుదీప్, చాంద్‌పాషా పాల్గొన్నారు.



ఆదివాసీలకు దుప్పట్లు, నిత్యావసరాలు అందిస్తున్న ఎస్పీ తదితరులు

క్లుప్తంగా

పెసా గ్రామసభలు విజయవంతం



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్

బూర్గంపాడు: సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల భూసేకరణ కోసం మంగళవారం మండలంలోని కృష్ణసాగర్, మోరంపల్లిబంజర, నాగినేనిప్రోలు, సోంపల్లి, ఇరవెండి గ్రామాల్లో పెసా గ్రామసభలు నిర్వహించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభల్లో భూసేకరణ వివరాలను వివరించారు. రైతులు కాల్వల తవ్వకాలపై తమకు ఉన్న అనుమానాలు, సందేహాలు, అభ్యంతరాలను గ్రామసభ దృష్టికి తీసుకురాగా.. అధికారులు నివృత్తి చేశారు. ఆయా సభల్లో ఇరిగేషన్ ఏఈఈ శ్యాంబాబు, ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాలయ్య, భవానీ, నాగిరెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగిన జిల్లాస్థాయి ఆటియా - పాటియా పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమస్థానంలో నిలిచారని, వీరు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఉషారాణి తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

19న బాక్సింగ్ జట్ల ఎంపిక పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా బాక్సింగ్ జట్ల ఎంపికకు ఈ నెల 19న కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేశ్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికలు, బాలురతో పాటు సీనియర్ పురుషుల జట్ల ఎంపికకు పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో హైదరాబాద్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాల కోసం హెడ్ కోచ్ సత్యబాబు, కోచ్ శ్రీనివాస్ నంబర్లు 92999 03203, 80393 78886లలో సంప్రదించాలని సూచించారు.

చీటింగ్ కేసు నమోదు

మణుగూరుటౌన్: దళితబంధు ఇప్పిస్తానని చెప్పి ఓ హోంగార్డు మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.80 వేలు తీసుకుని మోసం చేశాడు. ఈ ఘటనపై మణుగూరు పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. సీఐ సతీశ్‌కుమార్ కథనం ప్రకారం.. గతంలో హోంగార్డుగా పనిచేసిన కట్కోజుల శ్రీనివాసచారి గత ప్రభుత్వంలో దళితబంధు పథకం ద్వారా రూ.10 లక్షలు ఇప్పిస్తానని నవీన్‌కుమార్ వద్ద నుంచి రూ.80 వేలు లంచం తీసుకున్నాడు. తర్వాత పథకం ఇప్పించకపోవడంతో నవీన్ కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారించి చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ఇద్దరిపై...

వైరా: కల్యాణలక్ష్మి పథకం ద్వారా లబ్ధి పొందేందుకు నకిలీ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసిన ఘటనలో ఇద్దరిపై మంగళవారం వైరా పోలీసులు కేసు నమోదు చేశారు. వైరాకు చెందిన పిల్లలమర్రి ఉపేందర్, బానోత్ వెంకటేశ్వర్లు కలిసి నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి కల్యాణలక్ష్మి కోసం తహసీల్‌లో దరఖాస్తు అందజేశారు. ఆతర్వాత విషయం బయటపడడంతో ఆర్ఐ ఎం.వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాగర్ తెలిపారు. అంతేకాక కేసు విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని వెల్లడించారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు



గాయపడిన వసంత్

అశ్వాపురం: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడిన ఘటన మండలంలోని మిట్టగూడెం శివారులో మంగళవారం చోటుచేసుకుంది. మిట్టగూడెం – పాములపల్లి రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో అమెర్ద గ్రామానికి చెందిన ఎడవల్లి వసంత్, కల్యాణపురం గ్రామానికి చెందిన భూక్యా రవి గాయపడ్డారు. స్థానికులు 108కు ఫోన్ చేయగా అందుబాటులో లేక రాకపోవడంతో ప్రైవేట్ వాహనాల్లో వారిని మణుగూరు ఆస్పత్రికి తరలించారు. వసంత్‌ను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

లైసెన్సు నిల్లు.. కొనుగోళ్లు ఫుల్లు..

- చెప్పిందే మద్దతు ధర అన్నట్టుగా కొందరు వ్యాపారుల తీరు
- పెట్టుబడి సాయం చేశామని పంట ఉత్పత్తులపై కన్ను
- సీజన్ మొదలుకాగానే గ్రామాల్లో కొనుగోళ్లు
- అప్పుడప్పుడే అధికారుల తనిఖీలు



పత్తి కొనుగోలు చేస్తున్న చిరు వ్యాపారులు



కాంటాలు తరలిస్తున్న మార్కెట్ సిబ్బంది (ఫైల్)

ఇల్లెందు: ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలో అనుమతి ఉన్న వ్యాపారుల కంటే అనుమతి లేని చిరు వ్యాపారులే అత్యధికంగా ఉన్నారు. పల్లెలను పట్టుగొమ్మలుగా చేసుకుని ఎక్కడికక్కడే రైతులకు పెట్టుబడి పెట్టి దిగుబడి రాగానే అధిక వడ్డీ వసూలు చేయడంతో పాటు దర్జాగా అదే రైతుల నుంచి ఉత్పత్తులు లాగేసుకుంటున్నారు. ఏ ఒక్క రైతునూ మార్కెట్‌కు రానివ్వకుండా ఇంటి వద్దే కొనుగోలు చేస్తుండగా.. ఎవరికీ కనీస మద్దతు ధర చెల్లించకపోవడం గమనార్హం. ఈ చిరు వ్యాపారుల నుంచి బడా వ్యాపారులందరికీ రాజకీయ పార్టీల్లోని చోటామోటా నేతలు, కొందరు ప్రజాప్రతినిధులు వత్తాసు పలుకుతున్నారు. ఆయా పార్టీలకు రైతు సంఘాలు ఉన్నా వారు కూడా ఒకటి, రెండు సభలు, సమావేశాలు పెట్టి ర్యాలీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

బ్యాంకు రుణాలు అందక..

ప్రతీ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులు పదుల సంఖ్యలో ఉన్నాయి. అయితే రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో కొర్రీల కారణంగా అన్నదాతలు అటువైపు చూడడంలేదు. ఇదే అదునుగా వ్యాపారులు పంట సాగు సీజన్‌లో గ్రామాలకు వెళ్లి రైతులకు ఉన్న భూమి, సాగు చేసే పంటల ఆధారంగా రుణాలు ఇస్తున్నారు. అప్పు వడ్డీతో సహా చెల్లించాలనేది ఇక్కడ మొదటి నిబంధన కాగా, పంట ఉత్పత్తి వచ్చాక తమకే అమ్మాలనేది రెండో నిబంధన. అయినప్పటికీ పెట్టుబడికి చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు అప్పు చేస్తున్నారు. ఈ తతంగమంతా గమనించి ఎవరైనా అధికారులు పట్టుదలతో పని చేస్తే బదిలీలు, బెదిరింపులు సర్వసాధారణంగా మారడం గమనార్హం.

రూ.కోట్లు కొల్లగొడుతున్నారు..

ఇల్లెందు మార్కెట్ యార్డులోని ధర్మ కాంటాలకు తూకం బరువు, రైతుకు రక్షణగా నిలవాల్సిన గోదాంలకు సరుకు నిలువ చేయడం తెలియదనే చెప్పాలి. ఇల్లెందు ఏరియాలో రూ.లక్షల వ్యాపారం చేసే వ్యాపారులు మార్కెట్‌కు రాకపోగా, అధికారులే వారి ఇళ్లకు వెళ్లి ధాన్యం తోలకం పర్మిట్లు అందజేస్తున్నారు. ఈ క్రమాన పంట ఉత్పత్తుల ధరలను వ్యాపారులు రాజకీయ పక్షాలతో కలిసి నిర్ణయిస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు అందడం గగనమవుతోంది. ఇక మార్కెట్‌కు నిర్ణయించిన లక్ష్యాల మేరకు ఆదాయం రాబట్టుకునేందుకు కేవలం చెక్ పోస్టులు మీదే ఆధారపడాల్సి వస్తోంది. అధికారులు మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరపాలని కోరినా వ్యాపారులు లెక్క చేయడం లేదు. వరి ధాన్యం, పత్తి, కంది, పెసర, మొక్కజొన్న ఇలా పంట ఏదైనా లైసెన్సు లేని వ్యాపారులే దర్జాగా కాంటాలు తెరిచి కొనుగోలు చేస్తున్నారు. ఇల్లెందు మార్కెట్‌కు అనుబంధంగా బయ్యారం, గార్ల, గుండాల, టేకులపల్లి మండలాల్లో సబ్ మార్కెట్ యార్డులు, గోదాంలు ఏర్పాటు చేశారు. ఈ మార్కెట్ పరిధిలో 50 మంది వరకు లైసెన్స్ కలిగిన వ్యాపారులు ఉన్నా వీరికి రెట్టింపు స్థాయిలో అనుమతి లేని వ్యాపారులే పంటలు కొనుగోలు చేస్తున్నారు. చిన్న వ్యాపారుల వల్ల తాము కూడా నష్టపోతున్నామని లైసెన్స్‌డ్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ చిరు వ్యాపారులకు అండగా నిలిచే కొందరు నేతల ఒత్తిడితో అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి.. ఒకటి, రెండు కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారు.

చాలా మంది ఉన్నారు...



ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మండలాల్లో అనుమతి లేని వ్యాపారులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఏ పల్లెకు వెళ్లినా రైతులకు పెట్టుబడి పెట్టినందున తామే కొనుగోలు చేస్తున్నామని చెప్పే వారే అధికం. అనుమతి తీసుకోవాలని సూచిస్తే పైరవీలు చేయిస్తున్నారు. ఈ కారణంగా మార్కెట్ ఫీజు నష్టపోతుండగా, రైతుకు కనీస మద్దతు ధర లభించడం లేదు.

– ఇ.నరేష్ మార్కెట్ కార్యదర్శి, ఇల్లెందు

సర్వేకు ఇంటర్నెట్ సమస్య

- జిల్లాలో 83 పంచాయతీల్లో అందని సిగ్నల్
- ప్రత్యామ్నాయ యాప్ సిద్ధం చేసిన అధికారులు



లచ్చగూడెంలో సర్వే చేస్తున్న కార్యదర్శి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను ఎంపిక చేసేందుకు జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ఇందిరమ్మ కమిటీలు వేసిన ప్రభుత్వం వాస్తవ లబ్ధిదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. సర్వే ప్రతినిధులు తమ సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఇంటింటి సర్వేకు కదిలారు. ఇదిలా ఉండగా జిల్లావ్యాప్తంగా మారుమూల ప్రాంతాలకు చెందిన గ్రామపంచాయతీల్లో ఇంటర్నెట్ సిగ్నల్ సమస్య తలెత్తడంతో ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు ప్రారంభంలోనే బ్రేక్ పడింది. జిల్లావ్యాప్తంగా 33 పంచాయతీల్లో పూర్తిస్థాయిలో, 50 గ్రామ పంచాయతీల్లో పాక్షికంగా మొత్తంగా 83 గ్రామ పంచాయతీల్లో ఇంటర్నెట్ సిగ్నల్ అందడం లేదని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా యాప్‌ను వెంటనే సిద్ధం చేసింది. ప్రత్యామ్నాయంగా రూపొందించిన యాప్ ప్రకారం సర్వే ప్రతినిధులు ముందుగా ఆఫ్‌లైన్‌లో సర్వే ప్రక్రియ పూర్తి చేస్తారు. సెల్ సిగ్నల్ ప్రాంతానికి చేరుకోగానే ఆటోమెటిక్‌గా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతాయి. నూతన యాప్‌లో ఉన్న వెసులుబాటుతో సర్వేను వేగవంతం చేసేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఈ ప్రక్రియ ఒకటి, రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తుందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నెల 10వ తేదీ నుంచి ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం కాగా సిగ్నల్ లేని పంచాయతీలు మినహాయిస్తే మిగతా పంచాయతీల్లో సర్వే వేగవంతంగా సాగుతోందని, సిగ్నల్ లేని చోట్ల కూడా నూతన యాప్ సహాయంతో సర్వేను వేగవంతం చేస్తామని అధికారులు చెబుతున్నారు.

ఉపాధ్యాయుడి గైర్హాజరుపై విచారణ..!

సాక్షి ఎఫెక్ట్..



విచారణ చేస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు

కరకగూడెం: మండలంలోని వెంకటాపురం గిరిజన ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు తరచూ పాఠశాలకు గైర్హాజరవుతుండటంతో మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఐటీడీఏ అధికారులు విచారణకు ఆదేశించారు. మంగళవారం ఆ పాఠశాల పరిధిలోని కాంప్లెక్స్ హెచ్ఎం నాగేశ్వరరావు సదరు పాఠశాలను సందర్శించి విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సమావేశమై విచారించారు. ఏమాత్రం సమయపాలన పాటించడం లేదని, పాఠశాలకు రాకపోయినా వచ్చినట్లు హాజరు వేసుకుంటున్నాడని, చాలా రోజుల నుంచి పాఠశాలకు రావడం లేదని గ్రామస్తులు వెల్లడించారు. వివరాలను నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని హెచ్ఎం తెలిపారు. ఇదిలా ఉండగా.. మంగళవారం పాఠశాలకు వస్తానని కాంప్లెక్స్ హెచ్ఎంకు సమాచారం ఇచ్చిన ఉపాధ్యాయుడు పాఠశాలకు రాకపోవడం గమన్హారం. విచారణలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు గంగరాజు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టేలా చూడాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పీకర్‌ను కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ.. కార్పొరేషన్ ఏర్పాటుపై 1/70 చట్టం అడ్డుగా ఉందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌పై గత పాలకులకు, అధికారులకు సరైన అవగాహన లేకపోవడం, ఆర్డర్ అర్థం చేసుకోవడంలో లోపం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహణకు ఆటంకంగా మారిందన్నారు. ఇలాంటి సాంకేతిక లోపాలను అధిగమించి కార్పొరేషన్ ఏర్పాటు, పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు విషయమై పలుమార్లు జిల్లా మంత్రుల సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని, కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతో పాటు పరిసర గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని వివరించారు.

బెల్టు దుకాణాల్లో మద్యం పట్టివేత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణం సూపర్‌బజార్ ప్రాంతంలోని రెండు బెల్టు దుకాణాల్లో మంగళవారం పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించి, రూ.9 వేల విలువ గల 8.5 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. బెల్టు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశామని భద్రాచలం టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు.

రేకుల షెడ్డులోకి దూసుకెళ్లిన లారీ



రేకుల షెడ్డును ఢీకొట్టిన లారీ

చర్ల: మండల కేంద్రంలో ఓ లారీ వేగంగా వస్తూ అదుపుతప్పి రేకులషెడ్డులోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ ఇసుక ర్యాంపునకు ఇసుక లోడు కోసం వస్తున్న లారీ గాంధీసెంటర్ వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి.. ఆ పక్కనే ఉన్న రేకులషెడ్లోకి దూసుకెళ్లింది. శబ్దాన్ని గమనించిన ఇంటి యజమాని బయటకు వచ్చి చూడగా లారీ ఢీకొని ఉంది. లారీ డ్రైవర్ నిద్రమత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

వేతనాలు పెంచకపోతే సమ్మె చేస్తాం

రాత్రి కూడా కొనసాగించిన దీక్ష



రాత్రి దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.10 వేల వేతనాన్ని మధ్యాహ్న భోజన కార్మికులకు సత్వరమే అమలు చేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ హెచ్చరించింది. కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో సోమవారం చేపట్టిన 48 గంటల నిరసన దీక్ష రాత్రి చలిలోనూ కొనసాగింది. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌ను ముట్టడించి ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి, నిరసనకు మద్దతు తెలిపగా.. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రసంగించారు. ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రస్తావించి న్యాయం చేయాలని కోరారు. వేతనాలు పెంచకపోతే నిరవధిక సమ్మెతోపాటు అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నా వద్దకు డీఈఓ వచ్చి కార్మికుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో దొడ్డా రవికుమార్, కె.సత్య, పిట్టల అర్జున్, సుల్తానా, రామలక్ష్మి, సమ్మక్క, వెంకట నర్సమ్మ, కమల, శివమ్మ పాల్గొన్నారు.

'జమిలీ వెనుక నియంత పాలన కుట్ర'



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మం మామిళ్లగూడెం: జమిలీ ఎన్నికలు నిర్ణయించడం వెనుక నియంతృత్వ పాలన వైపు మోదీ ఆలోచనలు సాగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కలిసి మతోన్మాదం ద్వారా లబ్ధి పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. చింతకాని, కొణిజర్ల మండలాలు, పాలేరు, ఖమ్మం నియోజక వర్గాల సీపీఐ శ్రేణుల సమావేశం ఖమ్మంలో మంగళవారం జరగగా హేమంతరావు మాట్లాడారు. గడిచిన 11ఏళ్లుగా బీజేపీ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని, ఇప్పుడు జమిలీ ఎన్నికలను తెరపైకి తెచ్చారని తెలిపారు. కాగా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కమ్యూనిస్టుల అవసరం పెరుగుతోందని చెప్పారు. ఇక సీపీఐ వందేళ్ల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26న ఖమ్మంలో జరిగే రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతును విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మహ్మద్ సలాం, దండి సురేష్, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రబాబు, ఎస్.కే.జానీమియా, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి నంబర్ ఇస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ డీవీ

ఇల్లెందు: మున్సిపాల్టీలో ఇల్లు ఉండి నంబర్ లేని వారు ఎవరైనా ఉంటే తక్షణం మున్సిపాల్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే నంబర్ కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. మంగళవారం ఇలెందు పట్టణంలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలో 20, 21 వార్డుల ప్రజల కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి ఇంటి నంబర్లు కావాల్సిన వారికి కేటాయించారు. కొత్త కాలనీలో 638 గృహాలు ఉండగా ఇప్పటి వరకు 482 ఇళ్లకు నంబర్లు ఉన్నాయి. ఇక 156 వరకు మున్సిపల్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. కార్యక్రమంలో కౌన్సిలర్ కడకంచి పద్మ, వీరస్వామి, సిలివేరు సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మా చదువులు ఎలా..?



కేజీబీవీ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థినులు

కూసుమంచి: సమస్యల పరిష్కారం కోసం సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు వారం రోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఇందులో కూసుమంచిలోని కస్తూర్బాపాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది సైతం పాల్గొంటున్నారు. పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులకు గాను స్పెషల్ ఆఫీసర్‌తో పాటు 12 మంది ఆందోళనలకు హాజరవుతున్నారు. ఫలితంగా ఇద్దరు టీచర్లే మాత్రమే కేజీబీవీకి వస్తుండగా వారం రోజులుగా బోధన కుంటుపడింది. దీంతో తమ చదువులు సాఫీగా కొనసాగేలా అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు మంగళవారం పాఠశాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ప్రభుత్వం, అధికారులు టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

వరికొయ్యలను కాల్చకండి

వైరా రూరల్: వరికోతలు పూర్తయ్యాక మిగిలే కొయ్యలను కాల్చొద్దని ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య సూచించారు. ఇలా చేస్తే భూసారం తగ్గడమే కాక వాతావరణ కాలుష్యం పెరుగుతుందని తెలిపారు. మండలంలోని దాచాపురం, పూసలపాడుల్లో మంగళవారం పర్యటించిన ఆయన పొలాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా పలువురు రైతులు వరి కొయ్యలను కాలుస్తుండగా వారికి అవగాహన కల్పించారు. కొయ్యలను కలియదున్నడం ద్వారా భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఆతర్వాత ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు పరిశీలించిన డీఏఓ వైరా రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఓ మయాన్ మంజుఖాన్, ఏఈఓలు సైదులు, లాల్‌మహ్మద్, మౌలాలి, వెంకటేశ్వరరావు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌లో మహిళ మృతదేహం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్‌లో మంగళవారం గుర్తు తెలియని మహిళ(60) మృతదేహం లభ్యమైంది. రిజర్వాయర్‌లో మృతదేహాన్ని గుర్తించిన మత్స్యకారులు నాయకన్‌గూడెం గ్రామ కార్యదర్శి మంచాల దామోదర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతురాలి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు ఆత్మహత్య

కారేపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తిని ఆయన భార్య మందలించడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కారేపల్లి మండలం మంగళితండా గ్రామానికి చెందిన జాటోతు బాబురావు(29) ఇటీవల మద్యానికి బానిసై ఏ పని చేయడం లేదు. దీంతో ఆయన భార్య వీరమ్మ పని చేయకపోతే కుటుంబ పోషణ కష్టమవుతుందని మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన బాబురావు ఈనెల 16న రొట్టమాకురేవు సమీపంలో పురుగుల మందు తాగి ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు ఆయనను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై బాబురావు భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కామేపల్లి: ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ ఆటో డ్రైవర్ తీవ్ర గాయాల పాలై మృతి చెందాడు. మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపల్లికి చెందిన బానోత్ ప్రవీణ్(30) మంగళవారం ముగ్గురు ప్రయాణికులతో డోర్నకల్ నుంచి కామేపల్లి మండలం బండిపాడు మీదుగా ఖమ్మం బయలుదేరాడు. మార్గమధ్యలో రుక్కితండా స్టేజీ సమీపాన ఛతీస్‌గఢ్ నుంచి వస్తున్న తుఫాన్ వాహనం వేగంగా ఢీకొట్టింది. ఈఘటనలో ప్రవీణ్ తల ఆటో ముందు అద్దంలో నుంచి బయటకు రావడంతో మెడ కింద భాగం కోసుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే, ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి కారకులైన తుఫాన్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ...

తల్లాడ: తల్లాడలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో విద్యుదాఘాతం కారణంగా తాపీ మేస్త్రీ మంగళవారం మృతి చెందాడు. ఏపీలోని పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెంకు చెందిన అలుగుల వెంకట్(30) సహా పలువురు కుటుంబాలతో సహా వెంచర్‌లో కాంక్రీట్ పని చేసేందుకు రెండు నెలల క్రితం వచ్చారు. వెంచర్ ముందు ప్రహరీ నిర్మాణం కోసం కాంక్రీట్ పునాది వేస్తుండగా పైన 11 కేవీ విద్యుత్ వైర్లకు కాంక్రీట్ మిషన్(అజాక్స్) తగిలింది. దీంతో మిషన్‌కు విద్యుత్ సరఫరా కాగా దాన్ని పట్టుకున్న మేస్త్రీ వెంకట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం నుంచి కాంక్రీట్ మిషన్ డ్రైవర్ బయటపడ్డాడు. ఘటనాస్థలాన్ని ఎస్ఐ బి.కొండల్‌రావు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

టిప్పర్ ఢీకొని పాడి గేదె మృతి

అశ్వారావుపేటరూరల్: టిప్పర్ లారీ ఢీకొని ఓ పాడి గేదె మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట గ్రామ శివారులో ప్రధాన రహదారి దాటుతున్న పాడి గేదెను వినాయకపురం వైపు వెళ్తున్న టిప్పర్ వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్థానిక చిన్నంశెట్టి బజార్‌కు చెందిన చిన్నంశెట్టి కామేశ్వరరావుకు చెందిన రూ.70 వేల విలువైన పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది.

క్లుప్తంగా...

నేడు అసెంబ్లీ ముందుకు ఆర్‌ఓఆర్- 2024 బిల్లు

ప్రవేశపెట్టనున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలులోకి తెచ్చిన భూచట్టం స్థానంలో కొత్త చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఈ మేరకు రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)-2024 బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయి. సాదా బైనామాల పరిష్కారం, మ్యుటేషన్ తదితర కీలక అంశాలపై ఈ చట్టంతో స్పష్టత వస్తుంది. వాస్తవానికి, ఈ చట్టాన్ని తదుపరి సమావేశాల్లో ఆమోదించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నా, రైతుల ప్రయోజనార్థం ఈ సమావేశాల్లోనే చట్టాన్ని అమలులోకి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడింది..

వారెందుకు బేడీలు వేసుకోలేదు: మంత్రి సీతక్క ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడిందని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప కేటీఆర్, హరీశ్‌లు వేసుకోలేదన్నారు. నిరసనల్లో కూడా బీఆర్‌ఎస్ నేతల్లో సమానత్వం లేదన్నారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మంత్రి సీతక్క విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పదిసార్లకు పైగా బేడీలు వేశారని, అప్పుడు అందుకు కారణమైన అధికారులపై చర్యలు కూడా తీసుకోలేదన్నారు. రైతులకు బేడీలు వేసిన అంశాన్ని సీఎం రేవంత్ తీవ్రంగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. సభ్యుల ప్రవర్తన విషయంలో బీఆర్‌ఎస్ హయాంలో పెట్టిన నిబంధనలపై వాళ్లే అభ్యంతరం చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. 'గతంలో వెల్‌లోకి వస్తే సభ నుంచి సస్పెండ్ చేసేవారు. ఇప్పుడు వాళ్లు పెట్టిన నిబంధనలను వారే కాలరాస్తున్నారు'అని సీతక్క చెప్పారు.

అప్పుల లెక్కలు.. అన్నీ అబద్ధాలే



శాసనసభలో హరీశ్ వర్సెస్ భట్టి

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ పరస్పర విమర్శలు
- వాస్తవాలు నిరూపించేందుకు సిద్ధమంటూ సవాళ్లు
- ఎఫ్‌ఆర్‌బీఎం కింద రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశామన్న భట్టి



- గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించినట్లు వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ.1,27,208 కోట్లు అప్పు చేసిందన్న హరీశ్
- తాము పదేళ్లలో కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన అప్పులు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అప్పులు.. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయాన్ని వేడెక్కించాయి. ఆరోపణలు.. ప్రత్యారోపణలు, సవాళ్లు.. ప్రతి సవాళ్లతో సభ అట్టుడికింది. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క...గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావుల మధ్య వాడివేడి వాదనలు కొనసాగాయి. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పరస్పరం విమర్శించుకుంటూ వారివారి లెక్కలను సభ ముందుంచారు.

ప్రివిలేజ్ మోషన్‌పై మాట మార్చారు: భట్టి


'రాజకీయాలు చేయటమే లక్ష్యంగా వ్యవహరించే హరీశ్‌రావు సభలో అన్నీ అబద్ధాలే చెబుతారు. ఏడాదిలో మేం చేసిన అప్పులపై ఆయన చెప్పే లెక్కలు సరికాదు. పదేళ్ల వారి హయాంలో చేసిన అప్పుల లెక్కల్లోనూ ఆయనది ప్రజలను తప్పు దారి పట్టించే పద్ధతే. అందుకే మేం అధికారంలోకి రాగానే శ్వేత పత్రం రూపంలో వాస్తవాలను ప్రజల ముందుంచాం. మళ్లీ చర్చ పెడితే నిరూపించేందుకు సిద్ధం. బీఆర్‌ఎస్ నేతలు 10 సంవత్సరాల పాలనలో తప్పులు చేసినందుకు గత డిసెంబర్‌లో జనం శిక్షించారు. ఆరు నెలల్లో పార్లమెంటు ఎన్నికలప్పుడు డిపాజిట్ దక్కకుండా వారికి మతిపోయేలా చేశారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఆ పార్టీది భూస్వామ్య మనస్తత్వం. భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేయరా? అని ఖమ్మంలో ఓ విలేకరి అడిగినప్పుడు, వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పా. దాని ఆధారంగా ప్రివిలేజ్ మోషన్ ఇచ్చి, ఇప్పుడు అప్పుల మీద అవాస్తవాలు మాట్లాడితే ఇచ్చామంటున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో వారికి అనుకూలంగా సభ నియమాలు రూపొందించుకున్నారు. వారి నిబంధనల్లోనే సభలోకి ప్లకార్డులు తీసుకురావద్దని ఉంది.. కానీ నిన్న తీసుకొచ్చారు. వీరా నామీద ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది? వారి హయాంలో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నప్పుడు బీఏసీలో పాటించిన పద్ధతినే మేం ఇప్పుడు అనుసరిస్తున్నాం. ఇప్పుడు ప్రసాద్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తి మారారు తప్ప స్పీకర్ స్థానం అదే. ఆ స్థానాన్ని గౌరవించాలి కదా.. నిన్న బీఏసీలో కాగితాలు విసిరి బయటకొచ్చి ఏవేవో మాట్లాడుతున్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు అప్పు చేసిందని విపక్షాలు చేసే ప్రచారంలో వాస్తవం లేదు. ఎఫ్‌ఆర్‌బీఎం కింద మేము రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశాం. గ్యారంటీల కింద రూ. 61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించాం. మీ హయాంలో చేసిన అప్పుపై వడ్డీ రూపేణ రూ.66 వేల కోట్లు చెల్లించాం. మీరు పెట్టిపోయిన పెండింగు బిల్లులు రూ.40 వేల కోట్లలో ఇప్పటికి రూ.14 వేల కోట్లు చెల్లించాం. ప్రజల ఆస్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ఔటర్ రింగురోడ్డును ఆ ప్రభుత్వం 30 ఏళ్ల లీజు పేరుతో అమ్ముకుంది. అదే పద్ధతిలో మేం వచ్చే 30 ఏళ్ల కాలానికి జీఎస్టీ లాంటి ఆదాయ వ్యవహారాలను ఏ అదానికో, అంబానికో లీజుకిస్తే రాష్ట్ర పరిస్థితి ఏం కావాలి?..'అని భట్టి నిలదీశారు.

పరిమితంగానే మా అప్పులు: హరీశ్‌రావు

'మా ప్రభుత్వం పరిమితంగా చేసిన అప్పును తప్పుడు లెక్కలతో పెంచి భూతద్దంలో చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అబద్ధపు అప్పుల బూచి చూపి ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఆటలు సాగనివ్వం. మేం చెప్పే లెక్కలే సరైనవని నిరూపించేందుకు సిద్ధం. సభలో ప్రత్యేక చర్చ పెట్టండి, ఆడిటర్లను, ఆర్థిక నిపుణులను పిలిపించుకోండి.. నేను చెప్పేవే సరైన లెక్కలని నిరూపిస్తాను. ఇది నా ఛాలెంజ్. ఆర్బీఐ నేటి లెక్కల ప్రకారం గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు రూ.1,27,208 కోట్లు. ఐదేళ్లలో చేయబోయే అప్పు దాదాపు రూ.6,36,400 కోట్లు. కానీ మా ప్రభుత్వం పదేళ్ల కాలంలో తెచ్చిన అప్పులు కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే. 'ఆర్బీఐ తాజాగా విడుదల చేసిన గణాంకాలను ఆయన ఉటంకించారు) కరోనా కారణంగా కేంద్రం అదనంగా 1.75 శాతం అప్పు తీసుకోవాలని సూచించడంతో తీసుకున్నాం. లేకపోతే అంతకూడా అప్పు అయ్యేది కాదు. దీనిపై నేను సవాల్ విసురుతున్నా.. చర్చకు సిద్ధం. మేం రూ.6,71,757 కోట్లు అప్పు తీసుకున్నామని ఒకసారి, రూ.7 లక్షల కోట్లు అని మరోసారి, సభలో రూ.7,11,911 కోట్ల అప్పులంటూ నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతున్నారు. ప్రత్యేక చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తా. ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఏసీతో సంబంధం లేకుండా సభలో బిల్లులు ప్రవేశపెట్టడం వింతగా ఉంది. గత సభలో అప్పుల గురించి తప్పుడు లెక్కలు చూపినందుకే భట్టి విక్రమార్కపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాం. కానీ మరో అంశంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్టు అబద్ధాలు చెప్తున్నారు. చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తాం..'అని హరీశ్‌రావు సవాల్ చేశారు.



పెట్టుబడులపై తప్పుడు ప్రచారం: శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాలు తప్పుదారి పట్టించేలా సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ ఫాక్స్‌కాన్ ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తన ప్రణాళికలు అమలు చేస్తోంది. ఫాక్స్‌కాన్ పలు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించుకుంటూ, స్థానిక సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని, సమర్థవంతమైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఫాక్స్‌కాన్ గతంలో చేసిన ప్రకటనలకు కట్టుబడి ఉంది. వచ్చే మూడు రోజుల్లోనే ఫాక్స్‌కాన్ నుంచి భారీ పెట్టుబడుల ప్రకటన వస్తుంది. ప్రగతిని అడ్డగించే తప్పుడు ప్రచారాన్ని ఆపివేసి అన్ని పార్టీలూ అభివృద్ధికి మద్దతు ఇవ్వాలి. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలి'అని అసెంబ్లీ లాబీల్లో ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

కెప్టెన్ లేని బీఆర్‌ఎస్ నావ తుపానులో చిక్కుకుంది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: పార్టీకి నాయకుడు లేకపోతే ఎలా ఉంటుందో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సభలో చూస్తే స్పష్టంగా అర్థమవుతోందని మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెప్టెన్ లేని బీఆర్‌ఎస్ నావ తుపానులో చిక్కుకుందన్నారు. ఆ నావ ఎక్కడకు వెళుతుందో వారికే తెలియడం లేదని చెప్పారు. ప్రజా సమస్యలపై సభలో చర్చ జరగకూడదన్నది బీఆర్‌ఎస్ టార్గెట్‌గా కనిపిస్తోందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. భూమిలేని పేదలకు డబ్బులు ఇస్తామంటే బీఆర్‌ఎస్ వద్దంటోందని, రైతులకు మేలు జరగడం వారికి ఇష్టం లేదని విమర్శించారు. తనపై సభా హక్కుల తీర్మానం ఎందుకు ఇచ్చారో వారికే అర్థం కావడం లేదని భట్టి చెప్పారు.

కనీసం వెయ్యి కోట్లయినా ఇవ్వండి

- జీరో అవర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,020 కోట్ల మేర పేరుకు పోయాయని, అందులో కనీసం రూ.1,000 కోట్లయినా విడుదల చేయాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని మంగళవారం జీరో అవర్ సందర్భంగా ఆయన అసెంబ్లీ దృష్టికి తెచ్చారు. విదేశీ విద్యానిధి పథకం కింద విద్యార్థికి రూ.20 లక్షలు మంజూరు చేసేందుకు రూ.5 లక్షలు కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని.. ఏపీ, తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందారని గుర్తుచేశారు.

ఉస్మానియా తరలింపు ఆపండి: రాజాసింగ్



ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌కు తరలించే ప్రతిపాదనను రద్దు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. గోషామహల్‌లో ఆస్పత్రి కడితే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ఉస్మానియా వెనుకవైపు ఉన్న విశాలమైన స్థలంలో కొత్త నిర్మాణం జరపాలని సూచించారు.

- సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కోరారు.
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు.
- హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. దళితబంధు పథకం కింద 5 వేల కుటుంబాలకు ఇవ్వాల్సిన రెండోవిడత ఆర్థిక సాయాన్ని విడుదల చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ హయాం, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సవాల్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సవాల్ విసిరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్ విలేకరులతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై చర్చకు రెండ్రోజులుగా పట్టుబట్టినా ప్రభుత్వం పారిపోయిందని, సభా నియమాలపై నీతులు చెబుతూ ప్రభుత్వమే ఉల్లంఘించిందని ఆరోపించారు. పాలక పక్షం ప్లకార్డులు లోనికి తెస్తే స్పీకర్ ఎలా అనుమతించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు కన్నీరు పెడుతుంటే సీఎం, మంత్రులు జల్సాలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని, లగచర్లపై ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసిందని, అన్ని వ్యవస్థలను సీఎం రేవంత్ నిర్వీర్యం చేశారని విరుచుకుపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కేసులు, అరెస్టులు అంటూ నాలుగు గోడల మధ్య ఉండి రేవంత్ వార్తలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా వన్ మీద దమ్ముంటే చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసాలపై చర్చకు సిద్ధమని, దమ్ముంటే శాసనసభను పదిహేను రోజులు నడపాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో పోలీస్ పాలన నడుస్తోందని, అన్నింటికీ ఎదురొడ్డి ప్రజల పక్షాన పోరాడతామని చెప్పారు.



మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్

జిల్లా వార్తలు


రామయ్యకు రూ.2.50లక్షల విలువైన హారం



అధికారులకు హారం అందజేస్తున్న భక్తులు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భక్తులు బంగారు హారాన్ని బహూకరించారు. గుంటూరుకు చెందిన పదర్తి బ్రదర్స్ రూ.2.50లక్షల విలువైన 35గ్రాముల బంగారంతో చేయించిన హారాన్ని ఆలయ అధికారులకు మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు లింగాల సాయిబాబు, కత్తి శ్రీనివాస్, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణపురం సొసైటీకి రూ.30లక్షలు విలువైన భూమి వితరణ



పీఏసీఎస్ సభ్యులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న నాగప్రసాద్, తహసీల్దార్

బోనకల్: ఖమ్మం జిల్లా బోనకల్ మండలం నారాయణపురం ప్రాథమిక సహకార సంఘ భవనం, గోదాం నిర్మాణానికి నిర్మాణానికి బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, సొసైటీ చైర్మన్ బత్తినేని నాగప్రసాద్ రూ.30లక్షల విలువైన భూమి వితరణగా అందజేశారు. గ్రామంలోని సొసైటీ కార్యాలయానికి సరైన రహదారి సౌకర్యం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈమేరకు సొసైటీ చైర్మన్ నాగప్రసాద్ అధ్యక్షుడిగా ఉన్న చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 30కుంటల భూమిని తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి పత్రాలను సొసైటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తహసీల్దార్ పున్నంచందర్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోతినేని నర్సింహారావు, మన్నెపల్లి వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ కాకాని హన్మంతరావు, సీఈఓ ఎం.వెంకటేశ్వరావు, యనమద్ది శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు తూము రోషన్‌కుమార్, యంగల ఆనంద్‌రావు, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ గనిలో బుంగ



భూగర్భ గనిలో మోటార్లు అమరుస్తున్న కార్మికులు

కొండాపురం గనిలో ఈనెల 7నుంచి నిలిచిన బొగ్గు ఉత్పత్తి

- రోజుకు లక్ష గ్యాలన్ల నీటి పంపింగ్..
- నీరంతా బయటకు తరలించాకే ఉత్పత్తి పునరుద్ధరణ
- ఇదే సమయాన బుంగ ఏర్పడడానికి కారణాలపైనా అన్వేషణ



నీటిని బయటికి పంపింగ్ చేస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్: సింగరేణి మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో నీటి బుంగ ఏర్పడి బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. దీంతో నీటిని బయటకు పంపింగ్ చేస్తూ ఉత్పత్తిని పునరుద్ధరించాలా లేక మరోవైపు నుంచి ఉత్పత్తి చేయాలా అన్న అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. ఇదే సమయాన బుంగ ఏర్పడడానికి కారణాలను అన్వేషిస్తూ సర్వే అధికారులు, హైడ్రో జియోలాజికల్ అధికారుల నిర్ణయం మేరకు బొగ్గు ఉత్పత్తి మొదలుపెట్టాలని భావిస్తున్నారు. ప్రస్తుతం గనిలో ఉన్న 100 లక్షల గ్యాలన్ల నీటి తరలింపునకు 25 రోజులకు పైగా పట్టే అవకాశం ఉండగా, ఆ తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

యుద్ధప్రాతిపదికన తరలింపు...

భూగర్భగనిలో ఈనెల 7న తెల్లవారుజామున 41 లెవ ల్ హాలేజ్ డిప్ ప్రాంతం వద్ద ఆకస్మికంగా నీటి బుంగ ఏర్పడింది. అక్కడి నుంచి 38.1 సెల్సియస్ డిగ్రీల వేడినీరు ఉబికి వస్తూ మూడురోజుల వ్యవధిలో 104.53 లక్షల గ్యాలన్ల నీరు రాగా, 35 లెవల్ వరకు పూర్తిగా ముంపునకు గురవడంతో బొగ్గు ఉత్పత్తికి తీవ్రఆటంకం ఏర్పడింది. ఈనేపథ్యాన అధికారులు యంత్రాలను బయటకు తరలించి మోటార్ల సాయంతో నీటి పంపింగ్ మొదలుపెట్టారు. కాగా, గని స్థాయి కి తగినట్లు అందుబాటులో ఉన్న రెండు పంపులు సరిపోకపోవడంతో మరో రెండు పంపులు అమర్చి నీటిని 32 లెవల్ సంప్ వరకు పంపి అక్కడి నుంచి 20 లెవల్ వరకు మరో పంప్, రెండు మోటార్ల ద్వారా బయటకు తరలిస్తున్నారు. తొలిరోజు 2900 జీపీఏ (గ్యాలెన్ పర్ మినిట్)గా మైన్‌లోకి ప్రవేశించిన నీరు ఆతర్వాత 2వేలకు తగ్గింది. ఇది మరింత తగ్గే అవకా శం ఉందని భావిస్తున్నా, వస్తున్న నీరు పంపింగ్ చేస్తున్న నీరు సమానంగా ఉంది. ఈమేరకు యుద్ధప్రాతిపదికన మరో 240 హెచ్‌పీ మోటార్ అమర్చి అదనంగా రోజుకు మరో 8 నుంచి 9 లక్షల గ్యాలన్ల నీటిని బయటకు పంప్ చేస్తున్నారు. తద్వారా బొగ్గు ఉత్పత్తి త్వరగా ప్రారంభించొచ్చని అధికారుల భావనగా ఉంది.

భూకంపం, వేడినీరుపై ప్రభావంపై పరిశోధన?

కొండాపురం భూగర్భగనిలో లభించే జీ-6 గ్రేడ్ బొగ్గుకు బహిరంగ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈక్రమంలో బుంగ ఏర్పడి ఉత్పత్తికి ఆటంకం వాటిల్లడమే కాక తృటిలో పెను ప్రమాదం తప్పడాన్ని తీవ్రంగా పరిగణించిన యాజమాన్యం అందుకు కారణాలను అన్వేషిస్తోంది. భూగర్భగనిలో నీరు రావడం సాధారణమే అయినా రోజుకు 500-550 టన్నుల జీ-6 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి జరిగే ఇక్కడ ఆకస్మికంగా 38.1 డిగ్రీల వేడి నీరు లక్షల గ్యాలన్ల మేర రావడం అంతుచిక్కని ప్రశ్నగా మారింది. మణుగూరు మండలంలోని పగిడేరు వద్ద వేడి నీరు ఉబికి వస్తుండగా సంస్థ జియోథర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. దీంతో అక్కడి నీరు ఈ గనిలోకి వచ్చిందా లేక ఇటీవల భూప్రకంపనలే బుంగ ఏర్పడటానికి కారణాలా అన్న కోణంలో పరిశీలన చేస్తున్నారు. అయితే సర్వే అధికారులు, హైడ్రో జియోలాజికల్ అధికారులు మాత్రం జియోథర్మల్ ప్లాంట్ నుంచి వచ్చే నీరు 71.0 సెల్సియస్ డిగ్రీలుగా ఉండగా.. భూగర్భగనిలో మాత్రం 38.1 డిగ్రీలుగా ఉండడంతో ఈ రెండూ ఒకటి కాదనే ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఇక స్వల్పంగా భూమి కంపించిన 36 గంటల తర్వాత బుంగ ఏర్పడే అవకాశం లేదని భావిస్తున్నట్లు తెలిసింది.

వేగంగా పనులు

గనిలో విధులు నిర్వర్తించే 154 మంది ఉద్యోగులు, 36 మందితో కూడిన రెస్క్యూటీం, మ్యాన్ రైడింగ్ పనులు చేపట్టే 20 మంది సిబ్బందితో పాటు ఎస్‌ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికులంతా గనిలో నీటిని బయటికి పంపేందుకు పనుల్లో నిమగ్నమయ్యారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓలు లక్ష్మీపతిగౌడ్, వీరభద్రరావు, శ్రీనివాసరావు ఎప్పటికప్పుడు పరిస్థితులు పర్యవేక్షిస్తూ ఔట్‌ఫ్లోపై ఆరా తీస్తున్నారు. బుంగ నుంచి నీరు రావడం ఆగకపోతే పడమర వైపు, తూర్పు దిశగా లెవల్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేయాలా.. లేక బుంగ ఏర్పడిన ప్రదేశం వైపు నుంచే యథావిధిగా ఉత్పత్తి పునరుద్ధరించాలా అన్న అంశాలపై సమాలోచన చేస్తున్నారు. ఏదేమైనా గని భవిష్యత్‌పై ప్రమాదం పడకుండా అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

ఆనకట్టపై జాలువారుతున్న గోదావరి నీరు



ఇది ఆనకట్టే!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీరు జాలువారుతోంది. ఈ దృశ్యాన్ని చూస్తూ సమీప ప్రాంతాల్లో గడిపేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. శీతాకాలంలో జలపాతంలా, వేసవిలో అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాలకు వారధిలా, వర్షాకాలంలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తూ ఆనకట్ట కాలానికొక రూపు సంతరించుకుంటోంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆనకట్ట సందర్శకులను కనువిందు చేస్తున్నా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు.

– అశ్వాపురం

సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తా..



ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మంసహకారనగర్: సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు తెలిపారు. కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు మంగళవారం ఖమ్మంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. ఉద్యోగులకు పేస్కేల్ అమలు, ఇతర సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య, జిల్లా అధ్యక్షుడు షేక్ మహబూబ్‌పాషాతో పాటు అనిల్, మదార్ సైదులు, రుద్రగిరి, భగవాన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరగా కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రెగ్యులర్ చేయడమే కాక పేస్కేల్ అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఎంఈఓల జిల్లా ప్రధాన కార్యదర్శి వీరస్వామి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థ కుంటుబడుతున్నందున ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలవాలని కోరారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వైవీ రావు, సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శశిధర్ తదితరులు కూడా మద్దతు తెలిపారు.

విద్యుత్ రక్షణ సూత్రాలు తప్పనిసరి

సింగరేణి(కొత్తగూడెం): విద్యుత్ విభాగం ఇంజనీర్లు విధుల్లో రక్షణ సూత్రాలు పాటిస్తూ సిబ్బందికి అవగాహన కల్పించాలని సౌత్, సెంట్రల్ జోన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీఎంఎస్) ఎస్.ఆనందవేల్ సూచించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి రక్షణ చర్యలు పాటిస్తూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. తద్వారా వారు భద్రతగా ఉండటమే కాక సహచర సిబ్బందితో పని చేయించినట్లవుతుందని చెప్పారు. సదస్సులో ఏరియా జీఎం ఎం.శాలేంరాజు, వివిధ విభాగాల అధికారులు కె.సూర్యనారాయణ రాజు, రవీందర్, ఎం.వెంకటేశ్వరరావు, డీజీఎం కె.సోమశేఖరరావు, పీఓఎం శ్రీరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఎస్ ఆనందవేల్

బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

సత్తుపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 15, 16వ తేదీల్లో విజయవాడలో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సత్తుపల్లికి చెందిన కంచేటి కోటేశ్వరరావు 60 కేజీల విభాగంలో పతకం సాధించగా నిర్వాహకులు సన్మానించారు. కాగా, కోటేశ్వరరావు సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రౌండ్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడిగా పలువురికి శిక్షణ ఇస్తున్నారు.



జ్ఞాపిక అందుకుంటున్న కోటేశ్వరరావు